కథ

# ఓ నారాయణ కథ

**చింతా రాంబాబు**

**"ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే కోపం వల్ల మనిషి శక్తి ఎంతో హరించుకుపోతోంది. ఒక్క నిముషం కోపం ఓ వారంరోజులపాటు మనం తీసుకొన్న ఆహారంతో సమానం. అంత శక్తిని కోల్పోతాం."**

**తెల్సిన సంగతే అయితే గుళ్ళో కూర్చొన్న భక్తులందరూ స్వామీజీ చెప్పినదానికి అవునన్నట్టుగా తలలూపారు.**

"అంతేకాదు. క్షణాల్లో మిత్రులు శత్రువులైపోతుంటారు. ఈ కోపంవల్లే వందేళ్ళు ఆరోగ్యంగా బతకవల్సిన మనిషి యాభై ఏళ్ళకే షుగర్లని, బీపీలని టపా కట్టేస్తున్నాడు. కాబట్టి మీరందరూ కోపాన్ని అదుపులో పెట్టుకు తీరాలన్న సంగతి ఒప్పుకొని తీరుతారనుకొంటాను."

ఒప్పుకు తీరతామన్నట్టుగా భక్తులందరూ వినయంగా మళ్ళీ తలలూపారు.

"ఈ పరుగుల ప్రపంచంలో ఇది చెప్పినంత సులభంకాదని నాకు తెలుసు. ప్రతీక్షణం ఇంటాబయటా వత్తిడికి గురయి కోపం తెచ్చుకోవల్సిన సందర్భాలెన్నో ఎదురవుతూ ఉంటాయి. అలాంటప్పుడే మనం చాలా జాగురతతో వ్యవహరించాలి. కోపానికి విరుగుడు 'మౌనమే' అనుకోవాలి."

నిజమే! కోపానికి మౌనమే మందన్న సంగతి తమకి కూడా తెల్సునన్నట్టుగా భక్తులందరూ తలలూపారు.

"మాలాంటివాళ్ళు సంవత్సరాల తరబడి ఇదే విషయాన్ని పదేపదే చెప్తుంటారు. మీరు తలలూపుతుంటారు. మరుసటి రోజునుంచి మళ్ళీ మామూలే. ఈసారి మాత్రం అలా జరక్కూడదు. సీరియస్‌గా తీసుకోవాలి."

తీసుకొంటామన్నట్టుగా భక్తులందరూ కూడా సీరియస్ గానే తలలూపారు.

"భేష్! ఈ క్షణం నుంచి దీన్ని అమలుచేస్తామన్న భక్తులు చేతులెత్తండి."

స్వామీజీ చెప్పినదానికి ఆమోదిస్తూ దాదాపు అక్కడ కూర్చొన్నందరూ చేతులెత్తేశారనే చెప్పాలి.

అందరితోపాటు అక్కడ కూర్చొన్న నారాయణ కూడా ఉత్సాహంకొద్దీ ఒకటికాదు రెండు చేతులెత్తేసి స్వామీజీకి తన ఆమోదాన్ని తెలియజేశాడు. ఎందుకంటే నారాయణకు కోపం అలాగ ఇలాగాకాదు, చాలా ఎక్కువనే చెప్పాలి.

కానీ నారాయణ పక్కనే కూర్చొన్న ఓ దంపతుల్లో భర్త మాత్రం స్వామీజీ చెప్పినదానికి తన అంగీకారం తెల్పుతూ చెయ్యి ఎత్తలేదు.

ఆయన్ని కూడా చెయ్యి ఎత్తమన్నట్టుగా భార్య ఆయనకేసి చూసింది. ఉహు! ఆయనా చూపులను పట్టించుకోలేదు. నచ్చచెప్పే ధోరణిలో చెప్పి చూసింది కూడా. అయినా ఆయన ససేమిరా అన్నాడు. ఆఖరికి ఆమెకు కోపం వచ్చి మొగుడి డొక్కలో మోచేత్తో పొడిచి చూసింది కూడా. అయినా ఆ ఆసామి కిక్కురుమనలేదు. నోరు మెదపకుండా అలాగే బిర్ర బిగుసుకొని కూర్చొండిపోయాడు.

భార్య బతిమలాడి చెప్పినా, బెదిరించి చెప్పినా వినకుండా ఆయనెందుకలా మొండికేసాడో నారాయణకు అర్థంకాలేదు.

నారాయణకు మాత్రం చెయ్యి ఎత్తి స్వామీజీకి అంగీకారం తెల్పినందుకు చాలా సంతోషంగా అనిపించింది.

"మరి మీరందరూ చేతులెత్తి ఇప్పుడు నాకు మాట ఇచ్చారు. ఆమాట తప్పకూడదని మనసులోనే భక్తులందరూ దేముడికేసి చూస్తూ ప్రతిజ్ఞ తీసుకోండి."

స్వామీజీ చెప్పినట్టుగానే భక్తులందరూ భక్తిశ్రద్ధలతో మనసులోనే గట్టిగా ప్రతిజ్ఞ చేసుకొన్నారు.

"భేష్!చివరగా ఇందుకు కావల్సిన శక్తిసామర్థ్యాలను మీకు ప్రసాదించవల్సిందిగా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ శలవు తీసుకొంటున్నాను" అంటూ స్వామీజీ అంతటితో ప్రసంగాన్ని ముగించారు.


విషయం పాతదే అయినా స్వామీజీ ప్రసంగం నారాయణను చాలా బాగా ఆకట్టుకొన్నదనే చెప్పాలి. ఎందుకంటే గుళ్ళో కూర్చొన్న మొదటి పది నిముషాలు మనసంతా దేముడిమీద కాకుండా బయట వదిలివచ్చిన చెప్పులమీదనే ఉంది. డబ్బులివ్వవల్సి వస్తుందన్న ఉద్దేశంతో వాటికి కాపలా లేకుండానే బయట వదిలివచ్చాడు. ఇక్కడ స్వామీజీ ప్రసంగం వింటున్నాడేకానీ ఓ పక్క చెప్పులు ఉంటాయో ఊడతాయోనని మనసు పీకుతూనే ఉంది. అలాంటిది కాసేపట్లోనే స్వామీజీ ప్రసంగం చెప్పులతోపాటు తన ఇంటిని, ప్రపంచాన్ని కూడా మరిపింపజేసింది.

స్వామీజీ ప్రసంగానికి బాగా స్పందించిన కొంతమంది భక్తులు ఆయన పాదాలకి నమస్కరించటం చూసి నారాయణ కూడా ఆయన పాదాలను కళ్ళకద్దుకొని ఆయన చెప్పిన దాన్ని ఆచరించటానికి ఉద్యుక్తుడవుతూ ఇంటిదోవ పట్టాడు.

చిన్నప్పటి నుంచి తనకు కోపం జాస్తియేనని చెప్పాలి. ఇంటాబయటే కాకుండా బంధువర్గంలో కూడా 'అమ్మో నారాయణే! వాడికి చాలా కోపమే' అన్న ముద్ర కూడా పడిపోయింది.

ఈ కోపంవల్ల మానసికంగా ఎంతో వత్తిడికి గురవ్వటమే కాకుండా కొంతమంది మంచి మనుషులకి కూడా దూరమైపోతున్నాడు.

ఇంకా ఇంట్లో తన భార్యాపిల్లల సంగతైతే చెప్పనవసరంలేదు. తన కోపానికి ఎక్కువగా బలి అవుతున్నది కూడా వాళ్ళే!



స్నానానికి బాత్‌రూములో నీళ్ళు పెట్టినది మొదలు తనకు టిఫిన్‌బాక్సు సర్దిబాగ్‌లో పెట్టే ఈమధ్యకాలంలో భార్యమీద ఎన్నిసార్లు విరుచుకుపడతాడో లెక్కలేదు.

ఆమెచేసే పనుల్లో ఏ కొద్ది తేడా వచ్చినా, ఒక్క నిముషం లేటయినా పక్కవాళ్ళు వింటారన్న ఇంగితం కూడా లేకుండా అరుపులు కేకలతో ఆమెమీద శివాలెత్తుతాడు.

వంటావార్పులతోపాటు మగపిల్లలిద్దరిలో ఒకడ్ని స్కూలుకి మరొకడ్ని కాలేజికి టిఫిన్ బాక్సులతోసహా రడీచేసి పంపాల్సిన బాధ్యత ఆమెమీద ఉంది. అయినా ఆమెమీద రంకెలు, గాండ్రింపులు.

ఇంకా పిల్లల విషయానికొస్తే కాస్త నిదానంగా చెప్తే వినే పిల్లలే!

అయినా తన తీరే వేరుగా!

ఎప్పుడన్నా పొరపాటున కేబుల్ కనెక్షన్ కూడా లేని టీవీముందు కూర్చొని కనిపించినా, పరీక్షలో వెనుక మార్కులుకన్నా అరమార్కు తగ్గినా కోపంతో వాళ్ళను ఓపూట అన్నం నీళ్ళు ముట్టనిచ్చేవాడు కాదు.

పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. ఇద్దరిలో ఒకడు ఇంటరుకి కూడా వచ్చేశాడన్న సంగతి కూడా మర్చిపోయి మీదపడి కొట్టేంత పనిచేసేవాడు. కొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.

కనీసం తన మంచికోసం చెప్పిన విషయాలకి కూడా భార్యమీద కోపమే!

మీకు వంట్లో బాగోలేదుగా ఈరోజు ఆఫీసుకి శలవు పెట్టకూడదా అన్నా. రెండేగా తిన్నది ఇంకో ఇడ్లీ తినండి అన్నా, వర్షం వస్తోంది గొడుగు పట్టుకెళ్ళండి అన్నా భార్య మీద చిరాకు, కోపమే!

నోర్మూసుకోమన్నట్టుగా మాట్లాడేవాడు.

ఇంకా ఆఫీసులో కూడా చిన్నదానికి పెద్దదానికీ కూడా అందరిమీద చిర్రుబుర్రులే! ఎవర్నీ నోరెత్తనివ్వడు. తన సంగతి అర్థం చేసుకొని పాపం స్టాపంతా వాళ్ళే సర్దుకుపోతూంటారు.

ఈక్షణం నుంచీ ఈ కోపానికి స్వస్తి పల్కాలని మనసులోనే గట్టిగా నిర్ణయించుకొని ఇంటికి చేరుకొన్నాడు నారాయణ.

గేటు దగ్గరే భార్య పక్కింటావిడతో కబుర్లు చెప్తూ కనిపించింది.

తనను చూడంగానే మాట్లాడుతున్నమాటలు మధ్యలోనే ఆపుచేసి కంగారుగా తనవెనుకనే రావటం ప్రారంభించింది.

అది చూసి "అలా మధ్యలో వచ్చేస్తే ఆమె ఏమనుకొంటారు? వెళ్ళి మాట్లాడిరా" అన్నాడు శాంతంగా.

భార్య నమ్మలేనట్టుగా నారాయణకేసి ఓ కొత్త మనిషిని చూసినట్టుగా ఆశ్చర్యంగా చూసింది.

"అవును వెళ్ళిరా" శాంతంగానే మళ్ళీ అన్నాడు నారాయణ.

"చాలా థాంక్సండి. మధ్యాహ్నం నిద్రలో ఉండి మెలుకవ రాకపోవడంతో టీవీలో రోజూ చూసే సీరియల్ మిస్సయి పోయాను. అదే ఇప్పుడు వదినగార్ని అడిగి తెలుసుకొంటున్నాను. రెండు నిముషాల్లో వచ్చేస్తాను" అంటూ ఉత్సాహంగా పరుగులాటి నడకతో వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.



అదే పూర్వం అయితే ఆమె అలా కనిపించినా, తనను చూసి కూడా వెనువెంటనే ఆమె వెనక్కిరాకపోయినా ఆమెచేత గుంజీలు తీయించి నంత పనిచేసేవాడు.

అందుకే ఆమెకంత ఆశ్చర్యం, ఆనందం!

ఇంకా ఇంటిగుమ్మంలో అడుగుపెట్టంగానే పిల్లలిద్దరూ చెస్ ఆడుతూ కంటబడ్డారు.

అది వాళ్ళు చదువుకోవాల్సిన టైము. తనను చూడంగానే భయంగా చెస్ బోర్డు ఎత్తెయ్యబోతుంటే వద్దని వారించి "ఆట పూర్తవటానికి ఇంకా ఎంతసేపువద్దుంది"ని నిదానంగానే అడిగాడు.

**పదినిముషాలన్న ఆట పూర్తవటానికి ముప్పావుగంట పట్టింది. రెండు నిముషాల్లో వస్తానన్న భార్య అరగంటకి కానీ ఇంట్లోకి రాలేదు. అయినా నారాయణ ఎవరిమీదా కోపగించలేదు, ఆవేశపడలేదు. పొద్దుట చదివేసిన పేపరునే మళ్ళీమళ్ళీ చదువుతూ కూర్చొన్నాడు.**

"ఎంతసేపు డాడీ! జెస్ట్ టెన్ మినిట్స్" ఆట కంటిన్యూ కోసం అభ్యర్థనగా తనవైపు చూస్తూ ఇద్దరూ ఏకకంఠంతో అడిగారు.

"సరే"నన్నట్టుగా నారాయణ తలూపాడు.

ఇదివరకైతే చదువుకోవల్సిన ఆ టైములో అలా ఆడుతూ కనిపించినందుకు వెంటనే ఇద్దరి రెండు చెంపలూ వాయించి పెట్టేవాడు.

పదినిముషాలన్న ఆట పూర్తవటానికి ముప్పావుగంట పట్టింది. రెండు నిముషాల్లో వస్తానన్న భార్య అరగంటకి కానీ ఇంట్లోకి రాలేదు.

అయినా నారాయణ ఎవరిమీదా కోపగించలేదు, ఆవేశపడలేదు. పొద్దుట చదివేసిన పేపరునే మళ్ళీమళ్ళీ చదువుతూ కూర్చొన్నాడు.

తెచ్చిన ప్రసాదాన్ని ప్రశాంతంగా ముగ్గురి చేతుల్లో తనే పంచిపెట్టాడు.

ఫర్వాలేదు. స్వామీజీ ప్రసంగప్రభావం తన మీద బాగానే పని చేసిందనిపించింది నారాయణకు.

ఆ తర్వాత రోజు నుండి కూడా నారాయణ స్వామీజీ చెప్పినట్టుగానే కోపంబారిన పడకుండా జాగ్రత్తపడ్తూ వచ్చాడు.

కూరల్లో ఉప్పుకారాలు ఎక్కువైనా తక్కువైనా మాట్లాడకుండా తినేస్తున్నాడు. భార్య పక్కవాళ్ళతో షికార్లని, షాపింగులనీ ఇంటిపట్టున ఉండకుండా తిరుగుతున్నా చూసీచూడనట్టు పోతున్నాడు.

పిల్లలు గంటల తరబడి టివి చూసేస్తున్నా, ఆట లాడేస్తున్నా ఆఖరికి మార్కులు బాగా తగ్గిపోతున్నా సరే వాళ్ళకు నచ్చజెప్పే ధోరణిలోనే పోతున్నాడు.

ఆఫీసులో కూడా ఆఫీసు బాయ్‌ను నీళ్ళు అడిగినా, ఏదన్నా ఫైల్ అడిగినా వెంటనే ఇవ్వకపోయినా అసలివ్వకపోయినా అలాగే పక్కసీటాయన పనులు కూడా తననెత్తిమీద పడ్డా ఎవరిమీదా కోపగించకుండా అన్నీ శాంతంగా తనే చేసుకుపోతున్నాడు.

ఇంకా బయటి ప్రపంచంలో సిటీబస్సులో కండక్టరు చిల్లర ఇవ్వకపోయినా కొంతమంది మనుషుల వల్ల కొన్నిపనులు అనుకొన్నవి అనుకొన్నట్టుగా జరగకపోయినా ఎవరిమీదా కోపగించకుండా జీవితానికి నిర్వచనం 'సర్దుబాటు' అన్న లెక్కలో అన్నీ సర్దుకుపోతున్నాడు.

ఇవన్నీ ఇదివరకు పట్టించుకొనేవాడు. దాంతో వాళ్ళమీద కోపగించేవాడు. ఇప్పుడు పట్టించుకోవడం మానివేశాడు. అసలు కోపమేలేదు.

ఈవిధంగా మొదటి రెణ్ణెల్లు నారాయణకు జీవితం చాలా సాఫీగా గడిచిపోయింది. మనసుకి చాలా హాయిగా కూడా అనిపించింది.

ఆ తర్వాత తర్వాత నారాయణ జీవితంలోకి కొన్నికొన్ని అనుకోని కష్టాలు తొంగిచూడటం ప్రారంభమయ్యాయి.

కోపం మనసులో అంతో ఇంతో శేషించినా మళ్ళీమొదటికొచ్చే ప్రమాదముందన్న స్వామీజీ

మాటనే పట్టుకొని కొన్నిపట్టించుకోవల్సిన విషయాలను కూడా పట్టించుకోకుండాపోయాడు.

మనిషి సహజగుణాల్లో కోపం కూడా ఒకటని దాన్ని అవసరంకొద్దీ వాడుకోవాలన్న సంగతి కూడా పూర్తిగా విస్మరించి మౌనసముద్రంలో మునిగిపోయాడు.

దాంతో ఇదివరకెప్పుడైనా పక్కింటివాళ్ళతో సినిమాకెళ్ళాలంటే భార్య ముందుగా నారాయణను ఓ పదిసార్లు బతిమిలాడి పర్మిషన్ తీసుకొని వెళ్ళేది. ఇప్పుడు వెళ్ళివచ్చాక చెప్తోంది. అదీ అవసరం అనిపిస్తేనే చెప్తోంది. అలాగే ఆమె పెట్టే ఇన్‌స్టాల్‌మెంట్సు ఖర్చుల వల్ల ఇంట్లోకి అనవసరమైన వస్తువులు చేరటంతోపాటు నెలకో కట్టుడు చీరో, దాపుడుచీరో అంటూ బీరువాలోకి జమ అవ్వటం ప్రారంభమయ్యాయి.

దాంతో ప్రతిదీ చూసుకొని ఖర్చు పెట్టుకునే నారాయణకు పిల్లల చదువులు గట్టెక్కించగలడా లేడానన్న భయం పట్టుకొంది.

ఇదివరకు పనివత్తిడివల్ల ఆఫీసునుండి లేటుగా ఇంటికివస్తే నారాయణపట్ల చాలా సానుభూతిగా వ్యవహరించేది భార్య. కూర్చోబెట్టి గబగబా ఫాన్ ఆన్‌చేసి తాగటానికి నీళ్ళు ఇచ్చేది.

అలాంటిదిప్పుడు నిజంగా ఆఫీసువనేనా! లేక ఎక్కడన్నా రోడ్లు పట్టుకొని తిరిగొస్తున్నారా అన్న అనుమానపు చూపులు. పని ఉంటే మాత్రం పై సంపాదన లేనప్పుడు మీరు మాత్రం ఎందుకు చెయ్యాలంటూ కొత్తగా వాదనāపైగా కనుగుడ్లు రెండూ ఉరమటాలు, మూతి విరుపులు కూడా ప్రారంభమయ్యాయి.

కోపం తెచ్చుకోకుండా కాస్త గట్టిగా మాట్లాడబోతే ఇంక ఆరోజంతా ఇంట్లో వినవినలు, రుసరుసలు.

కోపమంటే ఏమిటో తెలియని మనిషి కోపం బారిన పడిపోయింది. మాట్లాడే ప్రతీమాటలోనూ విసుగుదల, కోపం. అవసరం లేకపోయినా ఇంట్లో ఆమె అరుపులు, కేకలతో నిండిపోతోంది.

ఆఫీసుకి టైమైపోతోంది. కాస్త త్వరగా టిఫిను బాక్సు సర్దమంటే...

"అవ్వనియ్యండి. ఇరవైఏళ్ళ నుండి ఎదుగు బొదుగూలేని మహా గొప్ప ఉద్యోగాన్ని వెలగబెడ్తున్నారుగా! ఆమాత్రం మేనేజ్ చేసుకోలేరూ" అంటూ వెటకారంతో కూడిన విదిలింపు.

"లతా! ఈరోజెందుకో నీర్సంగా అనిపిస్తూంది నీళ్ళు పట్టేపని పిల్లలు, నువ్వు సర్దుబాటు చేసుకోండి" అంటే-

"అదేం కుదరదు. పిల్లలు స్కూలుకి, కాలేజికి వెళ్ళే టైము. నాకు వంటావార్పు హడావుడి. మీరే ఓపిక చేసుకొని పట్టండి" తను ఆమెకు మొగుణ్ణి, ఇంటికి యజమానినన్న సంగతి కూడా పక్కన పాడేసి కరాకండీగా చెప్పేస్తోంది.

ఈ రెణ్ణెల్లలో దాదాపు నీవు చెప్పటమేమిటి? నేను వినటమేమిటన్నట్టుగా తయారైంది.

ఒకప్పుడు తన చూపులతోనే నిలువరించే భార్యను ఇప్పుడు మాటలతో కూడా నిలువరించలేకపోతున్నాడు.

ఎంతో వినయ విధేయతలతో ఒద్దికగా వ్యవహరించే భార్య పేట్రేగిపోతోంది.

ఆరోజున గుళ్ళో తనపక్కనే కూర్చొన్న ఆసామి భార్య మోచేత్తో పొడిచినా చెయ్యి ఎత్తకుండా ఎందుకలా గుండ్రాయిలా బిర్రబిగుసుకొని కూర్చొండిపోయాడో ఇప్పుడర్థమైంది నారాయణకు.

చాలాకాలం తర్వాత తనను చూడటానికని ఊరునుండి వచ్చిన తన తల్లిని పట్టించుకోకుండా మార్నింగ్ ఈవినింగ్ వాకింగులు, షాపింగు లంటూ తల్లి దారిన తల్లిని వదిలేసింది.

పూర్వం తల్లి వచ్చినప్పుడు ఆమె ఉన్న పది రోజులు ఆమెను కాలు కదవనిచ్చేది కాదు. మంచం దిగనిచ్చేది కాదు.



అలాంటిదిప్పుడు తను చూస్తుండగానే తల్లి తన అన్నం తనే పెట్టుకొంటోంది. తన బట్టలు తనే ఉతుక్కుంటోంది. కనీసం ఉతికిన బట్టలు ఆరెయ్యటానికి కూడా సాయం చేయటంలేదు.

తన చిన్నతనంలో స్కూలునుంచి ఇంటికి రాగానే ఇంట్లో తల్లి కనబడకపోతే 'అమ్మేది? ఎక్కడికెళ్ళిందం'టూ ఇల్లంతా అరచి గోల చేసేవాడు. ఆమె కనిపించగానే ఎదురెళ్ళి గట్టిగా వాటేసుకొని ఆమె చీరకుచ్చెళ్ళలో మొహం దాచుకొనేవాడు.

అలాంటి తన తల్లిని భార్య నిర్లక్ష్యం చేయటం ఏమాత్రం భరించలేకపోతున్నాడు.

ఆరోజు స్వామీజీ చెప్పినదానికి గుడ్డిగుఱ్ఱంలా బుర్ర ఊపుతూ చెయ్యి ఎత్తినందుకు మొదటిసారిగా తనను తాను తిట్టుకొన్నాడు నారాయణ.

ఇటు పిల్లల పరిస్థితి చూస్తే వాళ్ళల్లో క్రమశిక్షణ లోపించటం అటుంచి అసలు తన ఉనికినే పట్టించుకోవడం మానివేశారు.

తను చూస్తుండగానే ఇద్దరూ తిట్టేసుకొంటున్నారు. కొట్టేసుకొంటున్నారు. సినిమాలు షికార్లంటూ ఫ్రెండ్సుతో తిరిగేస్తున్నారు. చదువు మీద శ్రద్ధ తగ్గిపోయింది.

"ఏమిట్రా మార్కులిలా తగ్గిపోతున్నాయ్! పైగా ర్యాంకులు కూడా వెనక్కిపోయాయి..." అంటే

"ఏం చెయ్యమంటావ్ డాడీ! చదువు విషయంలో పిల్లల మీద పేరెంట్సు వత్తిడి పెరిగిపోయింది. దాంతో పోటీ పెరిగిపోయింది. ర్యాంకులు తగ్గిపోతున్నాయి" ఈ విషయంలో తమ ప్రమేయం ఏమీలేనట్టే చాలా తేలిగ్గా అనేస్తున్నారు.

"అయితే మాత్రం ఇంకా బాగా కష్టపడాలి. మార్కులు సంపాదించాలి" అని అంటుండగానే-

"అలాగే డాడీ! కానీ చిన్నప్పుడు నువ్వేమాత్రం మార్కులు సంపాదించావో నాయనమ్మ మాకు చెప్పిందిలే!"

గతుక్కుమన్నాడు. "ఏం చెప్పింది?" బలవంతాన నోరు పెగుల్చుకొంటూ అడిగాడు.

"తాతయ్య ట్యూషన్ పెట్టించినా ప్రతీ క్లాసు అత్తెసరు మార్కులతో పాసయ్యేవాడివని. అందులో సగం మార్కులు మళ్ళీ కాపీలు కొట్టి సంపాదించినవేనని" ఇద్దరూ మొహమొహాలు చూసుకొని ముసిముసిగా నవ్వుకొంటూ అన్నారు.

ఇంక వాళ్ళకేం చెప్పగలడు? తనకు వాళ్ళ మీద పట్టు తప్పిపోయిందన్న సంగతి అర్థమైపోయింది నారాయణకు.

ఒకప్పుడు తను ఈగదిలో ఉంటే పక్కగదిలో తారసట్లాడే పిల్లలు వీళ్ళు!

ఇంకా ఘోరమైన సంగతేమిటంటే ఓ రోజు సాయంత్రం చిన్నకొడుకు పరుగుపరుగున వచ్చి "డాడీ! డాడీ! ఓ అరగంటసేపు నీవు స్పేర్ చేసి మాతోపాటు వచ్చి కూర్చోవాలి" ఆయాసపడుతూ అడిగాడు.

"ఎందుకురా?" అర్థంకాక అడిగాడు.

"మేం పిల్లలం, పక్కన ఆంటీలు అందరం కల్సి జట్టులుగా అంత్యాక్షరి ఆడుతున్నాం. దానికి ఓ మనిషి తగ్గాడు. మా డాడీని తీసుకొస్తానని పరుగున వచ్చాను" తను వాడికి తండ్రినన్న సంగతే మర్చిపోయి జారిపోతున్న నిక్కరుని పైకి లాక్కుంటూ అన్నాడు.

క్షణంసేపు తను అవాక్కయిపోయాడు.

ఆఫీసులో కూడా పరిస్థితి తను ఉన్నా లేనట్టుగానే తయారైంది. తన శాంత స్వభావం కిందవాళ్ళు అలుసుగా తీసుకోవటం ప్రారంభించారు. సమర్థత స్థానంలో మెల్లగా అసమర్థత చోటు చేసుకోసాగింది.

దాంతో పై అధికారుల ముందు తను తల దించుకోవల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఒకప్పుడు తను నడిచి వస్తూంటే చాలు ఇంటా బయటా కూడా పక్కకి తప్పుకుతప్పుకుపోయే మనుషులు ఇప్పుడు నీ లెఖ్ఖేమిటన్నట్టుగా తల ఎగరేసుకొంటూ పోతున్నారు.

తన హోదా, అధికారం అన్నీ పక్కనపెట్టి వాళ్ళల్లో ఒకడిగా కల్సిపోయినందుకు కొద్దిగా కూడా గుర్తింపు, గౌరవం లేకుండా పోయింది.

ప్రశాంతంగా సాగే తన జీవన విధానంలో ఏమిటీ గందరగోళం?

తను నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా బతక్క పోయినా ఫర్వాలేదు. ఈ అవకతవకల క్రమశిక్షణారాహిత్యాన్ని, నిర్లక్ష్యపు ధోరణిలను అసలు భరించలేకపోతున్నాడు.

పరిష్కారం కోసం ఎంత తలబద్దలు కొట్టుకొన్నా తన పూర్వపు మనఃస్థితికి ఆ కరకుదనానికి వెళ్ళిపోవటం మినహా మరోమార్గం కనిపించడంలేదు నారాయణకు.

మరి అన్నిటికీ 'మౌనమే మందన్న' స్వామీజీకిచ్చిన మాటేంకావాలి?

దిక్కుతోచక జీవితంలో మొదటిసారిగా దిగాలుగా తలపట్టుక్కూర్చొన్నాడు పాపం నారాయణ!

ఇది జరిగిన వారం రోజులకి నారాయణ మొర ఆ గుళ్ళోని దేముడే ఆలకించాడన్నట్టుగా అనుకోకుండా స్వామీజీని ఆయన భార్యతోసహా సిటీబస్సులో చూడటం జరిగింది. తెల్లని పాంటు షర్టుతో స్వామీజీ ప్రయాణీకుల్లో కల్సిపోయాడు. కాకపోతే మొహాన ఇంత విభూతి, పెద్ద బొట్టుమాత్రం ఉన్నాయి. సీట్లన్నీ నిండిపోవటంతో ఆయన్నలా భార్యతోసహా నిలబడి ప్రయాణం చెయ్యటం చూడటానికి నారాయణకి ఇబ్బందిగా అనిపించినా అంతకన్నా నారాయణే మాత్రం ఊహించని ధోరణిని ఆయనలో చూశాడు.

అప్పటికే ఆయన ఎవరో తోటి ప్రయాణీకుడితో ఘర్షణ పడుతున్నాడు.

"అయితే ఏమంటావయ్యా! ఎంత జనం ఉంటే మాత్రం వచ్చి అలా మీదపడిపోవటమేనా? ముందు మనుషుల్ని చూసుకోవద్దూ?" ఆయన మొహంలోను, కంఠంలోనూ కోపం తన్నుకొచ్చింది.

"ఎవరిమీద పడకూడదనే ప్రయత్నించానండీ. వెనుకవాళ్ళు నెట్టెయ్యటంతో మీద పడక తప్పలేదు" వేడుకోలుగా అన్నాడా మీద పడ్డ కుర్రాడు.

"నెట్టినామాత్రం రాడ్ పట్టుకొని నిలబడాలని తెలీదూ" పట్టువిడవకుండా హుంకరించాడు స్వామీజీ.

"పోన్లెండి పాపం! చిన్నపిల్లాడు తప్పైపోయిందంటున్నాడుగా!" సర్దబోయింది భార్య.

అంతే! "ముందు నువ్వు నోరు మూస్తావా లేదా?" అంతమందిలోనూ ఆమెను పట్టుకొని కోపంగా ఒక్క అరుపు అరిచాడు స్వామీజీ.

పాపమా ఇల్లాలు కిక్కురుమనలేదు.

ఈ గొడవంతా చూసి పాపం ఒకరిద్దరు ప్రయాణీకులు స్వామీజీని కూర్చోమన్నట్టుగా సీట్లలో నుండి లేవబోయారు.

స్వామీజీ కూర్చోటానికి ఓ క్షణం బెట్టు చేసినట్టు చేసి వెంటనే వెళ్ళి టక్కున సీట్లో కూర్చొన్నాడు.

కూర్చొన్న స్వామీజీ కూర్చోకుండా పక్కన కూర్చొన్న తోటి ప్రయాణీకుడి వైపు కోపంగానూ, భార్యకేసి అర్థవంతంగానూ మార్చిమార్చి చూడసాగాడు.

స్వామీజీ కళ్ళల్లోని కోపాన్ని, అందులోని మర్మాన్ని గ్రహించిన ఆ ఆసామి వెంటనే లేచి నిలబడి తను కూర్చొన్న సీటుని స్వామీజీ భార్యకిచ్చేశాడు.

భార్యకి కూడా తన పక్కనే సీటు దొరకటంతో స్వామీజీ తేలిగ్గా ఊపిరి పీల్చుకోవటం గమనించాడు నారాయణ.

మెల్లిగా ఓ రెండు నిముషాల్లో స్వామీజీ మొహంలో ప్రశాంతత చోటు చేసుకోవడం, ఆ తర్వాత భార్యతో కులాసాగా కబుర్లలో పడిపోవటం జరిగిపోయింది.

ఇక్కడ బస్సులో కూర్చొన్న నారాయణకి కూడా జ్ఞానోదయమయిపోయింది.

బస్సుదిగి ఇంట్లోకి అడుగుపెట్టంగానే తలనొప్పిగా ఉండి భార్య లతను కేకేసి రిలీఫ్‌కోసం కాస్త కాఫీ పెట్టమంటూ కుర్చీలో కూలబడ్డాడు.

స్వామీజీ మాట ప్రకారం తు.చ. తప్పకుండా అన్నిటినీ లోపలికి దిగమింగుకొని మౌనంగా భరించటంతో అతనికీ మధ్య తరచుగా తలనొప్పి రావటం ప్రారంభమయింది.

"కాఫీపొడి అయిపోయింది ఆఫీసు నుండి వచ్చేటప్పుడు కొనితెమ్మన్నాను తెచ్చారామరి?" భార్య నుండి ఎదురుప్రశ్న.

"మర్చిపోయాను" అన్నాడు నారాయణ. నిజంగానే మర్చిపోయాడు.

"మరి కాఫీ ఎలా పెడ్తాననుకొన్నారు" భార్య కంఠంలో విసుగుదల.

నారాయణ మాటలకి నిరుత్తరాలై అతనికేసి చూసింది లత. ఎందుకంటే పూర్వం కూడా ఎప్పుడూ కోప్పడటాలు, కేకలెయ్యటం తప్పించి భర్త ఎప్పుడూ ఇంత పెద్ద మాట ఉపయోగించలేదు.



"షాపులో కొని తీసుకొచ్చి పెట్టు" సీరియస్‌గా అన్నాడు నారాయణ.

"అబ్బా! అవతల నాకు పేరంటానికి టైమైపోతోంది. ఓ గంట ఆగితే ఏకంగా భోజనమే చేసెయ్యవచ్చుగా!" పట్టుచీర సింగారించుకొంటూ చాలా సాఫీగా అంది లత.

"లతా! నాకు చాలా తలనొప్పిగా ఉంది. దయ చేసి ముందు కాఫీ పెడ్తావా, లేదా?" ఆజ్ఞాపించే ధోరణిలో కఠినంగా అన్నాడు నారాయణ.

భర్త కంఠంలోని తీవ్రతను గమనించిన లత అతని మొహంకేసి చూసి క్షణంసేపు తత్తరపడింది. ఎందుకంటే మూణ్ణెల్లతర్వాత మళ్ళీ మొదటిసారిగా మొగుడు మొహంలో అంత కోపాన్ని, పట్టుదలని చూస్తోంది.

ఏమైందీ ఈయనీకీవేళ? ఇంతలో ఇంత మార్పా! పొద్దుట ఆఫీసుకి వెళ్ళేటప్పుడు కూడా ఎప్పటిలాగానే మామూలుగానే వెళ్ళేరే! పల్లెత్తు మాట కూడా లేదు.

ఎందుకైనా మంచిదని కాస్త గొంతు తగ్గించి "పక్కింటి పిన్నిగారు రడీ అయిపోయి పాపం నాకోసం ఎదురుచూస్తున్నారండీ!" కాస్త జాలి మేళవించిన కంఠంతో అంది.

"సరే, అలాగే వెళ్ళు. పేరంటం అయిపోయాక పాపమా పిన్నిగారింట్లోనే ఉండిపో! మళ్ళీ ఇంట్లోకి అడుగుపెట్టవద్దు" కటువుగా అన్నాడు నారాయణ.

నారాయణ మాటలకి నిరుత్తరాలై అతనికేసి చూసింది లత. ఎందుకంటే పూర్వం కూడా ఎప్పుడూ కోప్పడటాలు, కేకలెయ్యటం తప్పించి భర్త ఎప్పుడూ ఇంత పెద్దమాట ఉపయోగించలేదు.

"ఏమిటలా చూస్తున్నావ్! నిజమే చెప్పున్నాను. మొగుడి బాధకంటే పిన్నీ, పేరంటాలే ముఖ్యమనుకొనే భార్య నాకవసరంలేదు" స్థిరంగా అన్నాడు నారాయణ.

భర్త నోరెత్తటం మానేసిన ఈ మూణ్ణెల్ల నుంచీ తన ఇష్టారాజ్యంగా మెలిగిన లత ఓ పక్క అయోమయంలో పడిపోతూ మరో పక్క ఇంక లాభంలేదనుకొని కాఫీ పొడిపొట్లం కొని తెమ్మంటూ కొడుకుని పురమాయించింది.

ఈ మూణ్ణెల్ల నుంచీ ఎదురు సమాధానాలకే అలవాటుపడిపోయిన పుత్రరత్నం తల్లీతండ్రి మధ్య జరుగుతున్న సంభాషణని కూడా పట్టించుకోకుండా "అబ్బా! టీవీలో మంచి ప్రోగ్రాం వస్తూంది మమ్మీ! తర్వాత తెస్తాలే!" టీవీ ముందునుంచి అర అంగుళం ఊడా కదలకుండా కేర్‌లెస్‌గా అన్నాడు.

అంతే! కుర్చీలో నుంచి నారాయణ విసురుగా లేచి కొడుకు చెంప 'ఛెళ్' మనిపించాడు.

ఊహించని ఈ పరిణామానికి వాడు బిత్తరపోయి తండ్రి మొహంకేసి చూస్తుండగానే రెండో వాడు భయంగా గబగబా డబ్బులు తీసుకొని కాఫీపొడి పొట్లాం కోసం బయటికి పరిగెత్తాడు.

మొత్తానికి ఓ వారంరోజుల్లోనే నారాయణ ఇంటి పరిస్థితి పూర్వపు స్థితికి వచ్చేసింది. అన్నీ పద్ధతి ప్రకారం జరిగిపోతున్నాయి. అరుపులు, కేకలు, ఎదురు సమాధానాలు అసలే లేవు. అంతా క్రమశిక్షణే!

ఆ తర్వాత పదిరోజుల్లో ఆఫీసు పరిస్థితిని కూడా మార్చేశాడు.

కాకపోతే నారాయణ మాత్రం ఆ తర్వాత నుంచీ ఇంటికి వచ్చిన వాళ్ళతోనే కాకుండా కనిపించిన ప్రతీవాళ్ళనీ కూడా కాసేపు నిల్చోబెట్టి కోపంవల్ల మనిషికి వచ్చే కష్టనష్టాలు, అది తెచ్చే అనారోగ్యాల గురించి, దాన్ని అదుపులో పెట్టుకోవల్సిన అవసరం గురించి ఏకరువు పెట్టడం ప్రారంభించాడు. ●